





TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ

# శాసనసభ


తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 149 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 04 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-


## ఇందిరమ్మ ఇళ్లు కీలక అప్డేట్: తొలి దశలో వీరికి మాత్రమే ఛాన్స్

## రూ.5 లక్షలు ఇచ్చేది అప్పుడే



- ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం కీలక ప్రకటన
- ఏ దశలో ఎంతెంత డబ్బులు అందిస్తారు అనే దానిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్లారిటీ

**శాసనసభ / హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈనెల 5 లేదా 6న ప్రారంభమవుతుందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఈనెల 20 వరకు మొదటి విడత అర్హుల ఎంపిక పూర్తవుతుందన్నారు. గ్రామసభలే లబ్ధిదారులను ఎంపిక చేస్తాయని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల జోక్యం ఉండదని పొంగులేటి తెలిపారు. పార్టీలకు అతీతంగా పేదల్లో నిరుపేదలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్న వారిని ఎంపిక చేసి దశల వారీగా 5 లక్షల రూపాయలు మంజూరు చేయనున్నట్లు మంత్రి చెప్పారు.

2

## బీసీ కులగణనపై తన నివాసంలో సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

- కులగణనకు ప్రత్యేక కమిషన్ ఉండాలన్న ఆర్.కృష్ణయ్య
- కృష్ణయ్య విజ్ఞప్తిని పరిశీలించాలన్న తెలంగాణ హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలపై మంత్రివర్గ సహచరులతో చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి

2




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో బీసీ కులగణనపై సీఎం రేవంత్ రెడ్డి నేడు తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, సంబంధిత అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కులగణన అంశంలో తెలంగాణ హైకోర్టు తీర్పుపై ఈ సమావేశంలో చర్చించారు.

## టీబీ వ్యాధిపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన

- భారత్ అద్భుతమైన పురోగతిని సాధించిందన్న ప్రధాని
- అంకితభావం, వినూత్న పద్ధతుల్లో కృషి ఫలితంగానే సాధ్యమైందని వ్యాఖ్య
- ఉమ్మడి స్ఫూర్తితో టీబీపై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడి



2

**ఢిల్లీ / శాసనసభ :** టీబీ (క్షయ) నివారణ విషయంలో అద్భుతమైన పురోగతి సాధించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. టీబీ రహిత భారతదేశాన్ని ఆవిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని ఆయన వెల్లడించారు. అంకితభావం, వినూత్న రీతిలో ప్రయత్నాల ఫలితంగానే దేశంలో టీబీ తగ్గుదలకు కారణమని అన్నారు.

## గడ్డిపల్లిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్..

### మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన

**శాసనసభ / హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

మిగతా »»2లో



## నాన్న హంతకురాలితో ప్రియాంక ఆలింగనం - రాహుల్ గాంధీ



**ఢిల్లీ / శాసనసభ :** భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం దేశంలో ప్రధాన పోరాటమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కోపంతోనో ద్వేషంతోనో రాజ్యాంగం రాయలేదని, వినయం, ఆప్యాయతతో రాశారన్నారు.

మిగతా »»2లో

## వక్ఫ్ సవరణ బిల్లు చంద్రబాబుకు ఇబ్బందికరంగా మారిన తాజా పరిణామాలు!



- పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ బిల్లు తీసుకురానున్న కేంద్రం
- ఆ బిల్లుకు మద్దతు ఇవ్వవద్దంటూ చంద్రబాబుకు ముస్లిం నేతల విజ్ఞప్తి
- ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ

మిగతా »»2లో

## అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలవాలంటూ తమిళనాడులోని ఓ గ్రామంలో పూజలు...

2



## రూ.1.50లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తారట..

### రైతులకు మాత్రం సున్నం పెడతాడట..

**శాసనసభ/ హైదరాబాద్ :** లక్షా50వేలకోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తారట.. కానీ, రైతులకు మాత్రం సున్నం పెడతాడట అంటూ రేవంత్ సర్కారుపై మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులను ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నెల రోజులుగా వడ్లు తెచ్చినా కోనేటోళ్లు లేరని..



మిగతా »»2లో

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత



**శాసనసభ / తిరుపతి:** తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబాన్ని హోం మంత్రి అనిత పరామర్శించారు.

మిగతా »»2లో

## 'కాళేశ్వరంపై కమిషన్ వేశారు.. మీపై ఏ కమిషన్ వేయాలి'

2



శాసనసభ
తెలుగు దినపత్రిక
సోమవారం 04 నవంబర్ - 2024

# కుల గణనకు అత్యంత ప్రాధాన్యం ఉన్నందున రాహుల్ వస్తున్నారు



**శాసనసభ / హైదరాబాద్ :** ఇందిరాభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, జారండ్ ఎన్నికల ప్రచారం లో బిజీ షెడ్యూల్ ఉన్న..తెలంగాణ కు రాహుల్ గాంధీ వస్తున్నారన్నారు. కుల గణన కు అత్యంత ప్రాధాన్యం ఉన్నందున రాహుల్ వస్తున్నారని ఆయన వెల్లడించారు. 5వ తేదీన సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ కు వస్తున్నారని, బిజీ షెడ్యూల్ ఉన్నందున రాహుల్ గంట సేపు మాత్రమే ఉంటారని ఆయన పేర్కొన్నారు. కుల గణన లో ఎలాంటి అంశాలు ఉండాలో సూచించాలన్నారు మహేష్ గౌడ్. కుల గణన అత్యంత ప్రాధాన్యత గా కాంగ్రెస్ పార్టీ స్వీకరించిందని, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర లో కుల గణన చేపట్టి ఆయా వర్గాల జనాభా ప్రకారం సంపద పంపిణీ జరగలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన వ్యాఖ్యానించారు.కులగణన ఎన్నో దశాబ్దాల తర్వాత జరుగుతున్నదన్నారు మహేష్ గౌడ్. కుల గణన జరిగితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, ఇందులో అనేక ప్రశ్నలు పొందుపరచడం జరుగుతోందన్నారు. ఇంకా ఎలాంటి అంశాలు ఉంటే సమగ్రంగా మరింత లోతుగా ఉంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లు చాలా పట్టుదలతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారని, తెలంగాణ కుల ఘనన దేశానికి ఆదర్శంగా ఉండాలన్నారు.

# భట్టి విక్రమార్క గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు..



**శాసనసభ / హైదరాబాద్ :** అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఇవాళ సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 200 కోట్ల రూపాయలతో స్కూల్ నిర్మాణం జరగబోతుందన్నారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. భట్టి విక్రమార్క గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడని, కాంగ్రెస్ పార్టీకి విధేయుడన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశాడని, భట్టి విక్రమార్క సమర్థవంతమైన నాయకత్వంతో రైతు రుణమాఫీ చేసామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. పరిచయం అవసరంలేని వ్యక్తి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని, అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన ఘనత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిది అని ఆయన కొనియాడారు.నియోజకవర్గ ప్రజలే నా కుటుంబ సభ్యులు అని, మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మా జీవితాన్ని త్యాగం చేశామన్నారు రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆయన ఉద్ఘాటించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా పూర్తి చేస్తామన్నారు మంత్రి ఉత్తమ్. 150 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఈసారి మార్కెట్ కు రాబోతుందని, జనవరి నుండి రేషన్ కార్డు దారులకు సన్న బియ్యాన్ని ఇవ్వబోతున్నామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

# 18 వేలు కోట్లు రుణమాఫీ చేశాం



**శాసనసభ / హైదరాబాద్ :** గత నలభై ఏళ్లుగా ఇల్లందు నియోజక వర్గంతో నాకు అనుబంధం ఉందని, ఆదివాసీలు గిరిజనులు ఎక్కువగా ఉన్న భద్రాచలం పినపాక ఇల్లందు నియోజక వర్గాల్లో ఎక్కువ సమయం కేటాయించా అన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.ఇవాళ ఆయన భద్రాద్రి కొత్తగూడెంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎర్ర బస్సు కరెంట్ బల్బు చూడని గుండాల ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు తో ప్రగతి బాట పట్టించానన్నారు. ఏ ప్రభుత్వంలో ఉన్నా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడ్డా అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా..రేవంత్ రెడ్డి పాలనలో ఇచ్చిన వాగ్దానాలు అన్ని అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. దేశం లో ఎక్కడా లేని విధంగా 18 వేలు కోట్లు రుణమాఫీ చేశామని ఆయన తెలిపారు.అధిక వర్షాలు వల్ల పత్తి దిగుబడులు తగ్గాయి గిట్టుబాటు వచ్చేలా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు, ఆయిల్ పామ్ సాగు తో రైతులకు లాభాలు, పత్తి సాగుతో నష్టపోకుండా ఆయిల్ పామ్ సాగు ఇల్లందు నియోజక వర్గంలో చేపట్టాలన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.

# నాన్న హంతకురాలితో ప్రియాంక ఆలింగనం - రాహుల్ గాంధీ

సోదరి ప్రియాంకకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వయనాడ్‌లోని మనంతవడిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించిన రాహుల్.. తమ తండ్రి హత్య కేసులో దోషిని (నళినిని ఉద్దేశిస్తూ) కౌగిలించుకున్న వ్యక్తి ప్రియాంక అని కొనియాడారు. వయనాడ్‌లో జరుగుతున్న ఎన్నిక ప్రేమ, ద్వేషాల మధ్య జరుగుతోన్న పోరాటమన్నారు."మా నాన్న (రాజీవ్ గాంధీ) హత్యకేసులో దోషిగా తేలిన వ్యక్తిని కౌగిలించుకున్న వ్యక్తి ప్రియాంకా గాంధీ. నళినిని కలిసిన తర్వాత నా దగ్గరకు వచ్చిన ప్రియాంక ఎంతో భావోద్వేగానికి గురయ్యింది. అంతేకాదు, ఆమెను చూస్తే బాధేసినట్లు చెప్పింది" అని రాహుల్ గాంధీ గుర్తు చేసుకున్నారు. ప్రియాంకను సోదరిగా పొందడం తన అదృష్టమని, ఇప్పుడు వయనాడ్‌లో విజయం సాధిస్తే అత్యుత్తమ ఎంపీగాను ఉంటారని చెప్పారు.దేశంలో ఇప్పుడు రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ద్వేషంతోనో, కోపంతోనే రాజ్యాంగాన్ని రాయలేదని.. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడి, ఏళ్లపాటు జైళ్లలో గడిపిన వారు వినయంతో, ప్రేమతో దీనిని రాశారన్నారు. అందుకే మనకు కావాల్సింది ద్వేషపూరిత రాజకీయాలు కాదని, ప్రేమ, ఆప్యాయతతో కూడిన రాజకీయాలు అవసరమన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## బీసీ కులగణనపై తన నివాసంలో సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

కులగణన కోసం ప్రత్యేక కమిషన్ వేయాలంటూ బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య కోరుతుండగా... కృష్ణయ్య విజ్ఞప్తిని వెంటనే పరిశీలించాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. వారంలోగా దీనిపై నిర్ణయం వెలువరించాలని స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాలపై సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సహచరులతో చర్చించారు. హైకోర్టు ఆదేశాలపై రేపటిలోగా చర్యలు తీసుకోవాలంటూ, ప్రత్యేక కమిషన్ ఏర్పాటుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన కులాల గణనకు తమ ప్రభుత్వం నిబద్ధతో పనిచేస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఈ సమీక్షకు హాజరయ్యారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన హెూం మంత్రి అనిత

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.అంతకుముందు చిన్నారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని, చిన్నారి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం హెూంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు."చిన్న పిల్లకు అన్యాయం జరిగింది. తాగిన మత్తులో తల్లికి, చెల్లికి తేడా తెలియదా? పండుగ అని ఇంటికి వస్తే ఆడుకునే చిన్నారిని ఇలా చేశారు. తొలుత చిన్నారి కనిపించడం లేదని 100కు ఫోన్ వచ్చింది. స్పందించిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. కానీ చిన్నారిని మాత్రం ప్రాణాలతో రక్షించలేక పోయారు. ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి మూడు నెలల వ్యవధిలో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తాం" అని హెూంమంత్రి అనిత తెలిపారు.'ఇలాంటి సమయంలో బుద్ధి ఉన్నవారు ఎవరూ రాజకీయం చేయరు. ఇటీవల పుంగనూరులో కూడా డబ్బుల విషయంలో చిన్నారిని చంపేశారు. చిన్న పిల్లల మరణాలను రాజకీయంగా వాడుకునే రాబందులు ఉన్నారు. గత ఐదేళ్లలో ప్రతి 8 గంటలకు ఒక దాడి జరిగింది. దిశ చట్టం యాప్ ఉంటే ఇలాంటివి జరగవని వైకాపా నేతలు అంటున్నారు. మేము మహిళా యాప్ వృద్ధిలోకి తెచ్చాం' అని హెూం మంత్రి తెలిపారు. తిరుపతి జిల్లాలో మూడున్నరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హతమార్చిన ఓ కామాంధుడు మృతదేహాన్ని పూడ్చి పెట్టిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన ఈ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

# టీబీ వ్యాధిపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన

ఇకపై కూడా 'ఉమ్మడి స్ఫూర్తి'తో టీబీ రహిత భారత్ కోసం పోరాడతామని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ స్పందించారు.టీబీ నివారణలో భారత్ సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టుపై ప్రధాని మోదీ ఈ మేరకు స్పందించారు. కాగా దేశంలో 2015 నుంచి 2023 మధ్య కాలంలో టీబీ వ్యాప్తి రేటు 17.7 శాతం మేర తగ్గిందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటు 8.3 శాతం ఉండగా భారత్‌లో రెట్టింపు ఫలితం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తమ ప్రభుత్వం 'ని-క్షయ్ పోషణ్ యోజన' వంటి కీలకమైన కార్యక్రమాలను చేపడుతోందని, తద్వారా జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని విస్తరించిందని నడ్డా ప్రస్తావించారు. ఇక మల్టీ-డ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్ చికిత్స కోసం కొత్తగా 'బీపీఎఎల్ఎం డ్రగ్ కోర్స్' ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. క్షయవ్యాధిపై జరుగుతున్న పోరాటంలో నిబద్ధతతో కీలక పాత్ర పోషిస్తున్న ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోగ్య కార్యకర్తల అవిశ్రాంత ప్రయత్నాలను తాను గుర్తిస్తున్నట్టు నడ్డా చెప్పారు.

# అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలవాలంటూ తమిళనాడులోని ఓ గ్రామంలో పూజలు...

తమిళనాడులోని తులసేంద్రపురం గ్రామంలో కమలా హ్యారిస్ కటౌట్‌లు తులసేంద్రపురం కమలా హ్యారిస్ తల్లి శ్యామల స్వగ్రామం కమలా హ్యారిస్ ను తమ ఊరి ఆడపడుచుగా భావిస్తున్న తులసేంద్రపురం గ్రామస్తుల సందడి అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. ఈ నెల 5న ప్రధాన ఎన్నిక జరగనున్నది. డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలో నిలిచి హెూరాహెూరీగా పోరాడుతున్నారు. ఇద్దరి నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల యుద్ధం కొనసాగుతోంది.ఇదిలా ఉంటే .. తమిళనాడులోని ఓ మారుమూల గ్రామంలో అమెరికా ఎన్నికల కోలాహలం కనబడుతోంది. తిరువరూర్ జిల్లా తులసేంద్రపురం గ్రామంలో కమలా హ్యారిస్ గెలుపును కాంక్షిస్తూ గ్రామస్తులు పోస్టర్‌లు, కటౌట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఎందుకంటే .. ఇది కమలా హ్యారిస్ పూర్వీకుల గ్రామం. కమలా హ్యారిస్ తల్లి డాక్టర్ శ్యామల స్వగ్రామం తులసేంద్రపురం. ఉన్నత విద్య కోసం ఇక్కడ నుంచి అమెరికా వెళ్లిన శ్యామల..కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎండోక్రైనాలజీలో పీహెచ్‌డీ పట్టా సాధించింది. అదే క్రమంలో జమైకా (బ్రిటీష్) నుండి అమెరికా వచ్చిన ఎకనామిక్స్ విద్యార్థి డొనాల్డ్ జే హ్యారిస్ తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి వివాహ బంధంతో ఒకటైయ్యారు. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డారు. శ్యామల, డొనాల్డ్ జే హ్యారిస్ దంపతుల రెండో సంతానం కమలా హ్యారిస్. అమెరికాలో పుట్టిపెరిగినా కమలా హ్యారిస్ అమ్మమ్మ గారి ఊరికి అప్పుడప్పుడూ వస్తూ వెళుతుండటంతో తులసేంద్రపురం గ్రామస్తుల తో అనుబంధం ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తమ ఊరి ఆడపడుచు కమలా హ్యారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందాలని కోరుతూ గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేస్తున్నారు.

# రూ.1.50లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తారట.. రైతులకు మాత్రం సున్నం పెడతాడట.. రేవంత్ సర్కారుపై హరీశ్‌రావు ఫైర్

పట్టించుకునే నాథుడు లేడు అని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వంలో వడ్లుకొనే దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం వడ్లు దళారులు కొన్నారని.. రైతులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు గోసపడుతున్నారని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర లేని పరిస్థితి దుస్థితి నెలకొందని.. ఎన్నికలకు ముందు రేవంత్ రైతుల మద్దతు కోరిన విషయాన్ని గుర్తు చేశారు.ఇప్పుడేఓ రైతులకు మద్దతు ధర ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతీ గింజ కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం నెల రోజులైనా కొనడం లేదని.. పగలంతా కోతుల బెడదతో ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ధర్నాలు చేస్తున్నారని, రైతులను రేవంత్ రోడ్డున పడేశారన్నారు. రైతుల ఓట్లు కావాలని గానీ రైతుల వడ్లు వద్దంటున్నారని.. ఒక్కనాడైనా కొనుగోళ్లపై రేవంత్ సమీక్ష నిర్వహించాడా? అంటూ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రేవంత్ ఊరూరు తిరిగాడని.. ఇప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి చూడాలలని డిమాండ్ చేశారు. వడ్లకు రూ.500 బోనస్ బోగస్ అయ్యిందని.. రైతుబంధు దిక్కలేకుండాపోయిందన్నారు. రేవంత్ ప్రభుత్వం రైతుల ఉసురుపోసుకుంటుందని.. ఎక్కడా మక్కల కొనుగోలు కేంద్రాలు పెట్టలేదని.. పత్తికి కూడా మద్దతు ధర రావడం లేదన్నారు. ఆంధ్రా దళారులు ఇక్కడికి వచ్చి ధాన్యం కొనుక్కువెళ్తున్నారని.. రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. క్వింటాల్‌కు రూ.500 రైతులు నష్టపోతున్నారన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ జరుగలేదని.. రుణమాఫీకి 31కోతలు పెట్టారని మండిపడ్డారు. కరోనా కష్టకాలంలో కేసీఆర్ రైతుబంధును రైతుల ఖాతాల్లో జమ చేశారని.. కేసీఆర్ 11 సార్లు 72,815 కోట్ల రైతుబంధు ఇచ్చారన్నారు. లక్షా50వేలకోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తారట.. కానీ, రైతులకు మాత్రం సున్నం పెడతాడట అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని.. తడిసిన ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఐకేపీ సెంటర్లకు కొబ్బరికాయలు కొడితే సరిపోతుందా? అంటూ ప్రశ్నించారు. మంత్రులు ఫొటోలకు ఫోజులిచ్చి పోయారని.. క్షేత్రస్థాయిలో కలెక్టర్లు, ఉన్నతాధికారులు పర్యటించాలన్నారు. రైతుల బతుకు గాల్లో దీపంలో తయారైందన్నారు. సోయాబీన్ రైతులకు ఇప్పటికీ డబ్బులు వేయలేదని.. సిద్దిపేట జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో వరిసాగైందని తెలిపారు. 9లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండాయని పేర్కొన్నారు. అధికారులు మాత్రం 800 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. పండిన పంటలో ఒకటో వంతు కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికే పావలాశాతం వడ్లు బయటకు వెళ్లిపోయానని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ అంటూ విమర్శించారు.

# ఏ హెూదా ఉన్నా, ఏ పదవి ఉన్నా తృప్తిగా పనిచేస్తా



**శాసనసభ / హైదరాబాద్:** కంటోన్మెంట్ బంజారానగర్ లో జరిగిన సీనియర్ సిటిజన్స్, బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అన్యాయంకి, దుర్మార్గంకి వ్యతిరేకంగా కొట్లాడడమే నా వ్యక్తిత్వమన్నారు. ఏ హెూదా ఉన్నా, ఏ పదవి ఉన్నా తృప్తిగా పనిచేస్తా అని, తృప్తిలేనిది, గౌరవం లేనిది ఎంత పెద్ద పదవి అయినా వ్యర్థమని నేను భావిస్తా అని ఆయన వ్యాఖ్యానించారు. ఈయన మా బిడ్డ అని ఇంటింటికీ భావించి నాకు ఓటువేసి గెలిపించారని, చెరువులు, మూసీ ప్రక్షాళనకు నేను వ్యతిరేకం కాదన్నారు ఈటల రాజేందర్.మూసీ బాగుపడాలని ఆ నీళ్లు నల్లగొండ రైతులకు ఉపయోగపడాలని కోరుకుంటున్నానని, కానీ ఇల్లు కూలగొట్టి రాత్రికి రాత్రి బిచ్చగాళ్లుగా చేసే పనిని వ్యతిరేకించానని ఆయన అన్నారు. పేదల పక్షాన కొట్లాడుతున్నానని, పేదవారి గొంతుక అయినందుకు గర్వపడుతున్నానని ఈటల వ్యాఖ్యానించారు. ప్రతిరోజు నేను ప్రజల మధ్యనే ఉంటానని, పిలిస్తే పలికే వ్యక్తిని ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఎక్కడ ఆపద ఉన్న మీ కుటుంబ సభ్యునిలాగా అందుబాటులో ఉంటానని ఈటల రాజేందర్ అన్నారు

# 365బిపై కేంద్రానికి డిమాండ్.. ఉద్యమిస్తామని హెచ్చరిక!



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణా రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా జాతీయ రహదారి 365బి విషయంలో తెలంగాణా రాష్ట్రం నుండి కేంద్రానికి డిమాండ్ వినిపిస్తుంది. జాతీయ రహదారి 365 బి ని రాజన్న సిరిసిల్ల జిల్లా మీదుగా కోరుట్ల వరకు విస్తరించాలని, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు, కరీంనగర్ మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్ కుమార్ కోరారు.బండి సంజయ్ ను టార్గెట్ చేసిన మాజీ ఎంపీ రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణం లోని తెలంగాణ భవన్ లో విలేఖరులతో మాట్లాడిన ఆయన కేంద్ర మంత్రి బండి సంజయ్ ను టార్గెట్ చేశారు. మంత్రి బండి సంజయ్ ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు మానుకుని జాతీయ రహదారుల విషయంలో ప్రజల డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా కేంద్రాన్ని ఒప్పించాలన్నారు.జాతీయ రహదారులను విస్తరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిక సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, సిరిసిల్ల వేములవాడ పట్టణాల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి '365బీ'ని కోరుట్ల వరకు విస్తరించాలని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా జాతీయ రహదారులను విస్తరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సూర్యాపేట-కోరుట్ల వరకు కే ఫోర్దేన్ రోడ్డు నిర్మిస్తే.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారితో, ఇటు ఆర్మూర్-జగదల్ పూర్ జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుందన్నారు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్.బండి సంజయ్ ఇది చెయ్యాల్సిందే కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సం జయ్ కుమార్ ఇప్పటికైనా జాతీయ రహ దారుల విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. ఢిల్లీ స్థాయిలో దీనిని ఫాలో అఫ్ చేయాలన్నారు. సిరిసిల్ల మానేరు వంతెనపై రాజమండ్రి తరహాలో రైల్వే బ్రిడ్జి కం రోడ్డు మార్గం నిర్మాణానికి గతంలో మంత్రి కేటీఆర్ తో కలిసి కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరి కి ప్రతిపాదించినట్లు ఆయన గుర్తు చేశారు.డీపీఆర్ స్థాయిలో ఉన్నప్పుడే అలైన్మెంట్ మార్చాలని సూచన సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నుంచి ప్రతిపాదించిన జాతీయ రహదారి అలైన్ మెంట్ మార్చి రైల్వేలైన్ తోపాటే నిర్మించాలని వినోద్ కుమార్ కోరారు. ఈ అలైన్మెంట్ కారణంగా సిరిసిల్లలో చిన్న స్థలాల యజమానులు నష్టపోతున్నా రని, అలైన్మెంట్ మార్చి పట్టణానికి దూరంగా వేయాలని కోరారు. డీపీఆర్ స్థాయిలో ఉన్నప్పుడే మార్పులకు సాధ్యమన్నారు.ఇక జాతీయ రహదారుల విస్తరణకు భూయజమానులు సహకరించాలని, భూము లు కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం అందించాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ కోరారు.

# రోడ్డు ప్రమాదానికి కారణమైన కమెడియన్ అరెస్ట్.. !



**శాసనసభ / హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదానికి కారణమైన స్టాండప్ కమెడియన్ ఉత్సవ్ దీక్షిత్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ర్యాష్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినందుకు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని 33 ఏళ్ల ఉత్సవ్ దీక్షిత్ పోర్షే కారును వేగంగా నడుపుతూ కేబీఆర్ పార్క్ గ్రిల్‌ను ఢీకొట్టాడు. అనంతరం కారు వదిలి అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల్లో పోర్షే కారును హాస్యనటుడు ఉత్సవ్ దీక్షిత్ నడుపుతున్నట్లు గుర్తించారు.బంజారాహిల్స్ పోలీసులు ఆ వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. దీక్షిత్ డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విలాసవంతమైన కారు బానెట్ తీవ్రంగా దెబ్బతింది. ఉత్సవ్ దీక్షిత్ పై బంజారాహిల్స్ పోలీసుల సెక్షన్ 110, 281 BNS సెక్షన్ 184 MV చట్టం & సెక్షన్ 3 PDPP చట్టం కింద కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సనాహితలోని సెక్షన్ 106 కింద నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన కేసు నమోదు చేశారు.ఉత్సవ్ దీక్షిత్ స్టాండప్ కమెడియన్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. నవంబర్ 1శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఫిలింనగర్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్ నం. 10 వైపునకు కారులో వేగంగా వచ్చి గోడను గుద్దాడు. కళింగ చౌరస్తా నుంచి క్యాన్సర్ అస్పత్రి వైపునకు వెళ్తున్న కారు యూటర్న్ సమీపంలో ప్రమాదకరమైన మలుపు వద్ద అదుపు తప్పినట్లు తెలిసింది. కేబీఆర్ పార్కు బయట ప్రహరీని, గ్రిల్స్‌ను ఢీకొట్టింది. బంజారాహిల్స్ రోడ్ నం. 6లో నివాసముంటున్న ఉత్సవ్ దీక్షిత్ ప్లాస్టిక్ కంపెనీకి ఎండీగా కూడా ఉన్నాడు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని తెలుస్తోంది.

# వైద్య ఖర్చు అత్యల్పం!గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ తక్కువే.. దేశంలోనే అగ్ర స్థానంలో తెలంగాణ



దేశవ్యాప్తంగా వైద్య ఖర్చులు పెరిగిపోతుండగా.. తెలంగాణలో మాత్రం అతి తక్కువగా పెడుతుండడం విశేషం. అవును మీరు చదివింది నిజమే! వైద్యంపై అతి తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది! ఈ విషయంలో పొరుగు రాష్ట్రమైన ఏపీలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. వైద్యంపై అత్యధికంగా వెచ్చిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది! ఇక నెలవారీ తలసరి వ్యయంలో కూడా తెలంగాణ టాప్‌లో నిలిచింది! మద్యం, మాంసాహారంపై ఖర్చులో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి! ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'జాతీయ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎసఎసవో)' సర్వేలో వెల్లడయ్యాయి. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం, పట్టభద్రులు, నిరుద్యోగం.. లాంటి అనేక అంశాలపై ఎన్‌ఎసఎసవో వివరాలు సేకరించింది.జులై-2022 నుంచి జూన్-2023 మధ్య అన్ని రాష్ట్రాల్లో 3 లక్షలకు పైగా కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1.73 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.28 లక్షల కుటుంబాలు ఉన్నాయి. గ్రామీణ, పట్టణాల్లో కుటుంబాలు చేస్తున్న ఖర్చు, ఇతర అంశాలకు సంబంధించిన సర్వే వివరాలను ఇటీవలే విడుదల చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ ప్రాంతాల్లో వైద్యంపై అతి తక్కువ ఖర్చుతో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, అత్యధిక ఖర్చులో ఏపీ(12%) నాలుగో స్థానంలో నిలిచింది. పశ్చిమబెంగాల్ ప్రజలు తమ మొత్తం ఆదాయంలో అత్యధికంగా 15 శాతం వైద్యంపై ఖర్చు చేస్తుండగా.. 14.4%తో కేరళ, 12.4తో పంజాబ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ విభాగంలో తెలంగాణలో ఖర్చు 6.1 శాతం మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంతో కేరళ, 16.8తో పశ్చిమబెంగాల్ తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 16.6 శాతంతో ఏపీ తర్వాతి స్థానంలో ఉంది. ఈ విభాగంలో తెలంగాణ 10.3 శాతంతో తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా నిలిచింది.

**82 శాతం సర్కారు బడుల్లోనే..**

ప్రైవేటు పాఠశాలలు పెరుగుతున్నా.. కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తున్నా.. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు సర్కారు బడుల్లోనే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 6-10 ఏళ్ల వయసు చిన్నారుల్లో 82.2 శాతం మంది సర్కారు పాఠశాలల్లో చదువుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో 54.7 శాతం మంది చదువుతున్నారు. తెలంగాణలో మాత్రం ప్రైవేటు బడుల్లోనే ఎక్కువ మంది అభ్యసిస్తున్నారు. 6-10 ఏళ్ల చిన్నారుల్లో 94.2 శాతం మంది బడులకు వెళ్తున్నారు. వీరిలో 52 శాత మంది ప్రైవేటులో.. 48శాతం మంది ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. దేశవ్యాప్తంగా 25 ఏళ్లు పైబడిన వారిలో కేవలం 38 శాతం మందే పదో తరగతిని పూర్తి చేశారు. 62 శాతం మంది విద్యార్హత పది లోపే. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 30.4 శాతం ఉండగా.. పట్టణాల్లో 56.6 శాతంగా ఉంది. తెలంగాణలో 25 ఏళ్లు పైబడిన మొత్తం జనాభాలో పదో తరగతి పూర్తి చేసుకున్నవారు 45.4 శాతం మాత్రమే ఉన్నారు.

**10 కోట్ల మందికి ఉపాధి, శిక్షణ లేదు..**

'స్కిల్ ఇండియా' పేరుతో నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే కేంద్రం చేపట్టిన ఈ సర్వేలో మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. దేశవ్యాప్తంగా 15-29 ఏళ్ల వారిలో 25.6 శాతం మందికి ఉద్యోగాలకు కావాల్సిన కనీస విద్య లేదు. ఉపాధి, నైపుణ్య శిక్షణకు దూరంగా ఉన్నారు. 2021 గణాంకాల ప్రకారం మొత్తం దేశ జనాభాలో 27.2 శాతం మంది 15-29 మధ్య వయసువారే. ఈ లెక్కన దేశ జనాభాలో దాదాపు 7 శాతం యువత విద్య, ఉపాధి, శిక్షణలకు దూరంగా ఉన్నారు. అంటే దాదాపు 10 కోట్ల మంది నిరుద్యోగులు. తెలంగాణలో 15-29 మధ్య వయసున్న మొత్తం జనాభాలో 16.1% మందికి ఉపాధి, నైపుణ్య శిక్షణ లేదు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 16.1 శాతం.. పట్టణాల్లో 16.4 శాతంగా ఉంది.

**తృణ ధాన్యాలపై 4% ఖర్చు..**

2022-23లో సరాసరిగా ఓ కుటుంబం చేసిన మొత్తం ఖర్చులో తృణధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలకు వెచ్చిస్తున్నదాన్ని చూస్తే.. బిహార్, అసోం ముందున్నాయి. ఈ రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో 55 శాతం ఖర్చు ఆహార పదార్థాలపై చేస్తుండగా.. ఇందులో 6 శాతం తృణధాన్యాలపై ఉంది. ఏపీలోని పట్టణ ప్రాంత జనాభా మొత్తం ఖర్చులో 43 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం ఆహారంపై ఖర్చు చేస్తున్నారు. తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో 39, గ్రామీణ ప్రాంతాల్లో 47 శాతం వెచ్చిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తృణ ధాన్యాలపై ఖర్చు సరాసరిగా 4 శాతంగా ఉంది.

**మద్యం ఖర్చులో నాలుగో స్థానం..**

ఆహారంపై చేస్తున్న మొత్తం ఖర్చు వివరాలను ఈ సర్వేలో వెల్లడించారు. ఇందులో మద్యం, ప్రాసెస్డ్ ఫుడ్‌పై అత్యధిక ఖర్చు చేస్తున్న టాప్-6 (గ్రామీణ ప్రాంతాలు) రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. 28.4 శాతంతో తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా.. కర్ణాటక 25.4, అసోం 24.6 తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 23.2 శాతంతో తెలంగాణ నాలుగో స్థానంలో నిలవగా. 22.9తో ఒడిశా 5, 21.4 శాతంతో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉన్నాయి. ఇందులో జాతీయ సగటు 20.7 శాతంగా ఉండగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖర్చు జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 33.7 శాతం ఖర్చుతో తమిళనాడు, 32.9తో కర్ణాటక తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 32.4తో తెలంగాణ, 28.0తో ఏపీ 3, 4 స్థానాల్లో నిలిచాయి.

**తలసరి వ్యయంలో నంబర్ వన్..**

నెలవారీ సగటు తలసరి వినియోగ వ్యయంలో పట్టణ ప్రాంతాల్లో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో ఓ కుటుంబం సగటున రూ.6459 ఖర్చు చేస్తుండగా.. తెలంగాణలో రూ.8158 ఖర్చు చేస్తున్నారు. రూ.7911తో హరియాణా, రూ.7666తో కర్ణాటక, రూ.7630తో తమిళనాడు, రూ.7078 కేరళ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇది రూ.6782గా ఉంది.

**86 లక్షల మందికి బడి తెలియదు..**

దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారిలో 2.1 శాతం మందికి పాఠశాల అంటేనే తెలియదు. ఇలాంటివారు గ్రామీణ ప్రాంతాల్లో 2.2 శాతం.. పట్టణ ప్రాంతాల్లో 1.9 శాతం ఉన్నారు. దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారి సంఖ్య 43.10 కోట్లుగా ఉంది. ఈ లెక్కన 2 శాతం మంది అంటే 86 లక్షల మంది అక్షరాభ్యాసానికి దూరంగా ఉన్నారు. తెలంగాణలో 6-18 ఏళ్ల వారిలో 0.4 శాతం మందికి బడి అంటే తెలియదు. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే.. 82.2 శాతం మంది చిన్నారులకు అనారోగ్యం, అంగ వైకల్య సమస్యలు, 16.6 శాతం మంది చదువుపై అనాసక్తి, 1.2 శాతం మంది ఆర్థిక సమస్యలతో పాఠశాలలకు దూరంగా ఉన్నారు.

**ఫోన్లలో తెలంగాణ 3వ స్థానం**

దేశవ్యాప్తంగా 96.1 శాతం మంది జనాభా మొబైల్ ఫోన్లు (స్మార్ట్ ఫోన్లతో సహా) వినియోగిస్తున్నారు. 99.40 శాతం మందికి ఫోన్లతో కేరళ అగ్రస్థానంలో.. 98.6 శాతంతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. 98.5 శాతంతో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 97.8 శాతం మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కేరళ మొత్తం జనాభాలో 99 శాతం మంది ఇంటర్నెట్ వినియోగిస్తుండగా.. తెలంగాణలో 94.4 శాతం మంది వినియోగదారులు ఉన్నారు. కర్ణాటకలో 92.4 శాతం, తమిళనాడులో 90.5, ఏపీలో 91.1% ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు.

**మాంసాహారంలోనూ ముందే..**

మాంసాహారంపై ఎక్కువ ఖర్చు చేయడంలో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ఐదో స్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల మొత్తం ఆదాయంలో కేరళ వాసులు 19.8 శాతం మాంసాహారంపై ఖర్చు చేస్తుండగా.. పశ్చిమబెంగాల్ 18.9, అసోం 17.0, తమిళనాడు 12.3 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమానంగా నిలిచాయి. రెండు రాష్ట్రాల ప్రజలు మాంసాహారంపై 11.9 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇందులో జాతీయ సగటు 9.1 శాతంగా ఉంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో చూస్తే.. 23.5 శాతంతో కేరళ ప్రథమ, 20తో అసోం ద్వితీయ, 18.9తో పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానంలో ఉండగా.. 15.8తో తెలంగాణ నాలుగు, 14.8తో ఏపీ ఐదో స్థానంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు 10.6 శాతంగా ఉంది.

**టెక్నాలజీ పట్టభద్రుల్లో టాప్..**

సైన్స్ అండ్ టెక్నాలజీ పట్టభద్రుల సంఖ్యలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా 21 ఏళ్లు పైబడిన వారిలో మొత్తం పట్టభద్రుల్లో 34 శాతం ఈ కోర్సుల్లో పట్టా పొందుతుండగా.. తెలంగాణలో వీరి శాతం 62.3గా ఉంది. ఏపీ 58.5 శాతంతో రెండో స్థానంలో ఉంది. సంపూర్ణ అక్షరాస్యత కలిగిన కేరళలో సైన్స్ పట్టభద్రులు 47 శాతం, ఢిల్లీలో 26 శాతం, కర్ణాటకలో 41 శాతం, తమిళనాడులో 57 శాతంగా ఉంది. అలాగే 21-59 మధ్య వయసున్న పట్టభద్రుల్లోనూ 63 శాతంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. 59.8 శాతంతో ఏపీ రెండో స్థానంలో ఉంది. దేశంలోని మొత్తం పట్టభద్రుల్లో 38శాతం సైన్స్, టెక్నాలజీ గ్రాడ్యుయేట్లే.

## ఎస్సీ వర్గీకరణను అడ్డుకొంటున్నది కాంగ్రెసే



**శాసనసభ / హైదరాబాద్ :** "ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నది.. వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలను ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ పార్టీనే" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెసలోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల ఒత్తిడికి సీఎం రేవంత్ తలొగ్గి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీ చేపడుతున్నారని విమర్శించారు.ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 'మాదిగల ధర్మయుద్ధ మహాసభ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై మంత్రులతో కమిటీ వేసిన సీఎం రేవంత్.. మళ్లీ కమిషన్ ఎందుకు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని సీఎం రేవంత్ అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు.

## త్వరలో ప్రజాస్వామ్య తెలంగాణ



**శాసనసభ / హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలోనే ప్రజాస్వామ్య తెలంగాణను స్థాపిస్తామని, అందుకోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు.తెలంగాణలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో చర్చలు జరుపుతున్నారని చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆదివారం టీజేఎస్, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌర సమాజంతో మాటా ముచ్చట కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడు తూ.. ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిందని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. త్వరలోనే విద్య, వైద్యంపై పూర్తి స్థాయి లో విశ్లేషణ చేసి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని మొత్తం అప్పుల పాలు చేసిందని, దానిని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం: ఎప్పట్నుంచంటే?




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో సంక్రాంతి తర్వాత తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈసారి వరి ధాన్యం 150 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యిందని తెలిపారు. ప్రోత్సాహకంగా సన్న వరిధాన్యం పండించిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల రూపాయలు ఉచిత వైద్యం, రూ. 18 వేల కోట్లతో రుణమాఫీ, అన్ని సౌకర్యాలతో ఆధునాతన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రూపొందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.భారతదేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని తెలిపారు. సర్వే నెంబర్ 57లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను రూ. 200 కోట్లతో నిర్మించుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఈ స్కూల్‌లో 4 నుంచి 12వ తరగతి వరకు క్లాసులు జరుగుతాయన్నారు.గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి వచ్చినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్నవారు కాంగ్రెస్ సభ్యులు కారు.. వీరంతా తమ కుటుంబసభ్యులని అన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇంత మెజార్టీ ఇచ్చినందుకు ప్రజలకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. కాగా, రేషన్ షాపుల్లో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## కడియంకి రేవంత్ రెడ్డిని కలిసే దిక్కు లేకుండా పోయింది.



**శాసనసభ / హైదరాబాద్:** జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ..కడియం శ్రీహరి కన్ను మిన్ను తెలియకుండా మాట్లాడుతుండు అంటూ నిప్పులు చెరిగారు. పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేల్లో మోసగాళ్ళకే మోసగాడు కడియం శ్రీహరి అని, నమ్మకద్రోహి, జిత్తులు మారి నక్కగా పేరున్న కడియం శ్రీహరి కేటీఆర్ పై మాట్లాడడం సిగ్గు చేటు అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ప్లాఫ్ ప్రభుత్వం, అందుకే కేటీఆర్ పాదయాత్ర చేపడుతున్నారన్నారు. కేటీఆర్ పై కడియం నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నానన్నారు తాటికొండ రాజయ్య. కడియంకి రేవంత్ రెడ్డిని కలిసే దిక్కు లేకుండా పోయిందని, పార్టీలు మారడంలో కడియం శ్రీహరి మెరుపు వీరుడు,హైట్రిక్ సాధించాడన్నారు తాటికొండ రాజయ్య. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వీరుడు కడియం అని ఆయన సెటైర్లు వేశారు. కేసీఆర్ కు ఎవరు చేయని నమ్మకద్రోహం చేసి 100 కోట్లకు అమ్ముడు పోయినా నిక్రుష్టుడు కడియం శ్రీహరి అని, తాత ముత్తాతల నుండి ఆస్తి పరులైన కేసీఆర్, కేటీఆర్ పై కడియం శ్రీహరి స్థాయిని మరిచి మాట్లాడుతున్నాడన్నారు.

## కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలో మెటా.. చిట్టి టైప్ రోబోలకు లైన్ క్లియర్




**శాసనసభ / హైదరాబాద్:** పెరుగుతున్న సాంకేతికత ఆధారంగా కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పలు నూతన సాంకేతికతలకు ప్రాణం పోసింది. మెటాకు చెందిన AI పరిశోధన బృందం FAIR రోబోటిక్స్ రంగంలో కీలక ముందడుగు వేసింది. అవి మరింత సమర్థవంతంగా మానవులకు ఉపయోగపడే విధంగా మార్పులు చేసింది.ఫండమెంటల్ AI రీసెర్చ్ (FAIR) రోబోటిక్స్ రంగంలో కొత్త సాధనాలతో ముందుకు సాగుతోంది. రోబోలకు స్పర్శ, కదలికలతో పాటు మనుషులతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని ఇవ్వడానికి కృషి చేస్తోంది. ఈ ప్రయత్నాలు రోబోలను సాంకేతికంగా మాత్రమే కాకుండా నిజజీవితంలో కూడా సురక్షితంగా మరియు సహజంగా మానవులకు సహాపడే విధంగా రూపొందించేందుకు దోహదపడతాయి.అధునాతన సెన్సార్లు మరియు వ్యవస్థల ద్వారా రోబోలకు స్పర్శను కల్పించాలని మెటా టీమ్ పనిచేస్తోంది. ఇవి రోబోలను మనుషుల మాదిరిగా సున్నితత్వంతో, అనుకూలంగా పనులు చేసేందుకు వీలు కల్పిస్తాయి. ఆరోగ్యరక్షణ, తయారీ మరియు వర్చ్యువల్ రియాలిటీ రంగాల్లో రోబోల వినియోగానికి త్వరలో అనేక అవకాశాలు పుట్టుకొస్తాయని ఆ బృందం చెబుతోంది.ఇందులో భాగంగా మెటా స్పర్శ్, మెటా డిజిట్ 360, మెటా డిజిట్ ఫ్లెక్సస్ అనే మూడు కొత్త సాంకేతికతలను మెటా ఆవిష్కరించింది. స్పర్శ్ అనేది ఒక టచ్-సెన్సింగ్ టెక్నాలజీ. స్పర్శ ద్వారా ఒత్తిడి, కదలికను గుర్తించడంలో ఇది AI కి సాయం చేస్తుంది. ఈ టెక్నాలజీ రోబోకు ఒక సాధారణ స్పర్శ భావనను అందిస్తుంది. డిజిట్ 360 అనేది అధునాతన ఆర్టిఫిషియల్ ఫింగర్‌టిప్. ఇది వేలి గోరుని కూడా కవర్ చేసే శక్తివంతమైన లెన్స్ తో నిర్మించబడింది. తద్వారా అన్ని దిశల్లో చూసేందుకు మరియు వివిధ ఉష్ణోగ్రతలకు స్పందించేందుకు రోబోలకు తోడ్పాటు అందిస్తుంది.ఇక ఫ్లెక్సస్ అనేది మల్టిపుల్ టచ్ సెన్సర్లను రోబో హ్యాండ్ లో కలిపే వ్యవస్థ. వేలు గోరు నుంచి చేయి వరకు స్పర్శ భావనను అందిస్తుంది. రోబో హ్యాండ్ల కదలికను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఇది వైద్య ప్రక్రియలలో సున్నితమైన పనులకు బాగా ఉపయోగపడుతుంది. మెటా అక్కడితో ఆగకుండా జెల్‌సైట్ ఇన్క్ మరియు వోనిక్ రోబోటిక్స్ అనే రెండు కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వీటి ద్వారా ఈ టచ్-సెన్సింగ్ టూల్స్ ఉత్పత్తి, పంపిణీ చేయనుంది.

## ప్రభుత్వాలు కూల్చిన చరిత్ర బీజేపీది



**శాసనసభ / హైదరాబాద్:** ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుమ్మక్కయ్యాయని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.కుట్రపూరితంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి వేసిన చరిత్ర బీజేపీకి ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో బీజేపీ నేతలు సిద్ధహస్తులను ధ్వజమెత్తారు. జూన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి మారతారంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో గెలిస్తే అధికారం చేపట్టడం, ఓడితే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషించడం ప్రజాస్వామ్యబద్ధ పార్టీల విధి అని, కానీ బీజేపీ మూడో మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎసతో కలిసి ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా ? అని చూస్తోందని మండిపడ్డారు. కుట్రపూరితంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూల్చి వేసిందంటూ, మహారాష్ట్రలో బీజేపీ అనుసరించిన వైఖరిని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో బీజేపీకి తగిన పాఠం చెబుతారని అన్నారు. సీఎం మారుతారన్న ప్రకటన ద్వారా రాష్ట్ర ప్రజలకు బీజేపీ ఏ సంకేతం ఇవ్వదలుచుకుందని నిలదీశారు. ఇక, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండో రోజు నుంచి బీఆర్ఎస్ విషం చిమ్మడం మొదలుపెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎసది అధికార దాహమని, ప్రజలు ఆ పార్టీని గద్దె దించిన విషయాన్ని కూడా మరిచిపోతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయనీ, అందుకే ఆ పార్టీల నేతలు విపరీతమైన వ్యాఖ్యలు చేస్తున్నారని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో విద్యావ్యవస్థ: సీతక్క



**ములుగు, నవంబరు 3 శాసనసభ :** తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు.16 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పాలనలో ఇది సాధ్యమైందన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి ములుగు జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క ఆదివారం పర్యటించారు.స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని సందర్శించిన మంత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమీకృత గురుకులాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచ్చి నాణ్యమైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని, అర్థంలేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యంలో ములుగులో నిర్మించిన గోదామును సీతక్క ప్రారంభించారు.

శాసనసభ

సోమవారం 04 నవంబర్ - 2024

# నయని పావని ఎలిమినేటెడ్.. వాళ్లు ఐదుగురు డమ్మీ ఆటగాళ్లు!

బిగ్‌బాస్ సీజన్–8 నుంచి నయని పావని ఎలిమినేట్ అయింది. ఈ వారం నామినేషన్స్‌లో చివరి వరకూ నయని పావని, హరితేజలు ఉండగా, తక్కువ ఓట్లు వచ్చిన నయని ఎలిమినేట్ అయినట్లు వ్యాఖ్యత నాగార్జున ప్రకటించారు.అనంతరం వేదికపైకి వచ్చిన ఆమె తన జర్నీ చూసుకుని ఎమోషనల్ అయింది. హౌస్‌లో ఉన్న వాళ్లలో ఐదుగురు డమ్మీ ఆటగాళ్లు, ముగ్గురు బెస్ట్ ఆటగాళ్లు ఎవరో చెప్పాలని నాగార్జున అడిగారు.గంగవ్వ: అందరితో పోల్చుకుంటే గేమ్ ఆడటం వయసురీత్యా ఆమెకు కష్టం.రోహిణి: కొంచెం సేఫ్‌గా ఆడుతోంది. గొడవ జరిగినప్పుడు ముఖం మీదే మాట్లాడతారు.అవే విషయాలు ఆమె కూడా ఫాలో అవ్వాలి. ఒకరి తప్పు ఎత్తిచూపటం చాలా ఈజీ. మనం కూడా అన్ని విషయాల్లో కరెక్ట్‌గా ఉండాలి.వెనకాల మాట్లాడకూడదు. ఎంటర్‌టైన్‌మెంట్ పరంగా బాగున్నా..సింగిల్‌గా ఆడాలి.ప్రేరణ: కోపంలో తెలియకుండా కొన్ని పదాలు వచ్చేస్తున్నాయి. నిన్ను ఎవరైనా ఇబ్బంది పెడితే ఎలా అనిపిస్తుందో.. నీ మాటల వల్ల ఎదుటి వాళ్లకూ అలాగే ఉంటుంది. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలి.గౌతమ్: ఒకరి నుంచి మనం ఏదైనా ఆశిస్తున్నామంటే అదే స్థాయిలో మనం కూడా ఇవ్వాలి.ఆ విషయంలో కొంచెం నియంత్రణలో ఉండాలి.విష్ణు: నువ్వు గేమ్ బాగా ఆడతావు. అయితే, ఇప్పుడు ఆడుతున్నది సరిపోదు. ఇంకా బాగా ఆడాలి.హరితేజ: నీలో ఆ ఫైర్ ఉంది. గతవారం చూపించావు.ఇంకా బాగా ఆడాలి.నిఖిల్: మంచి వ్యక్తి. బయటకు కోపంగా ఉంటాడు కానీ, చిన్న పిల్లాడి మనస్తత్వం. నువ్వు చెప్పాలనుకున్నది ముఖంపైనే చెప్పు.పృథ్వీ: అందరి కన్నా నిజాయతీ కలిగిన వ్యక్తి పృథ్వీ. నీ మాటలకు నువ్వు కట్టుబడి ఉండు.

# ఏడాది క్రితమే చర్చలు.. బాలీవుడ్ ప్రాజెక్టుపై సూర్య



'కంగువా' తో త్వరలోనే ప్రేక్షకులను పలకరించనున్నారు కోలీవుడ్ నటుడు సూర్య . పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నారు. అందులో భాగంగా ముంబయి వెళ్లిన ఆయన ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. యాంకర్ అడగ్గా తాను నటించనున్న బాలీవుడ్ ప్రాజెక్టుపై స్పందించారు. ''ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లాలంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. నేను చేయబోయే చిత్రం విషయంలోనూ అంతే. ఏడాది క్రితమే దానిపై చర్చలు జరిగాయి. ఆ సినిమాని నిర్మాతలు ప్రకటిస్తేనే బాగుంటుంది. అందుకే నేను ఇప్పుడు ఏం చెప్పలేకపోతున్నా" అన్నారు.'కంగువా' గురించి మాట్లాడుతూ.. "నేనిందులో కంగువా, ఫ్రాన్సిస్ అనే రెండు పాత్రలు పోషించా. అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది. 'యానిమల్' సినిమా విడుదలకు ముందే బాబీ దేవోల్‌ను 'కంగువా'లో ఎంపిక చేశాం. ఇందులో చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు. 27 ఏళ్ల ప్రస్థానంలో 44 చిత్రాల్లో నటించానని గుర్తుచేసుకున్నారు. వాటిలో 'కాఖా కాఖా' అంటే బాగా ఇష్టమని తెలిపారు సూర్య హీరోగా దర్శకుడు రాకేశ్ ఓంప్రకాశ్ భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కించనున్నారని, దానికి 'కర్ణ' టైటిల్ పెట్టే అవకాశం ఉందని బాలీవుడ్‌లో వార్తలొచ్చాయి. ఇటీవల జరిగిన ఐఫా అవార్డుల వేడుకలో ఆ డైరెక్టర్ స్పందిస్తూ.. ఆ వార్తలు నిజమేనన్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. టైటిల్ ప్రస్తావన తీసుకురాలేదు. మహాభారతం ఆధారంగా ఆ సినిమా తెరకెక్కనుందని, సూర్య.. కర్ణుడిగా నటించనున్నారని సమాచారం. ఫాంటసీ యాక్షన్ నేపథ్యంతో దర్శకుడు శివ తెరకెక్కించిన 'కంగువా' ఈ నెల 14న విడుదల కానుంది. కోలీవుడ్‌లో ఇప్పటివరకు ఇలాంటి సినిమా రాలేదని, రూ.2000 కోట్లు వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉందని నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్‌టాపిక్‌గా మారాయి.





# వేడుకగా హీరో నార్నే నితిన్ నిశ్చితార్థం.. ఎన్టీఆర్ సందడి



యువ కథానాయకుడు నార్నే నితిన్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. తాళ్లూరి వెంకట కృష్ణప్రసాద్–స్వరూప దంపతుల కుమార్తె శివానితో ఆయన నిశ్చితార్థం ఆదివారం జరిగింది.ఈ వేడుకలో ఇరు కుటుంబాల పెద్దలు పాల్గొన్నారు. ఎన్టీఆర్, ఆయన సతీమణి లక్ష్మీ ప్రణతి, తనయులు అభయ్, భార్గవ్‌తోపాటు కల్యాణ్‌రామ్, వెంకటేశ్ తదితరులు సందడి చేశారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తాళ్లూరి కుటుంబంతో వెంకటేశ్ ఫ్యామిలీకి బంధుత్వం ఉన్నట్టు సమాచారం.ప్రముఖ పారిశ్రామికవేత్త నార్నే శ్రీనివాసరావు తనయుడు నార్నే నితిన్‌చంద్ర. ఎన్టీఆర్ బావ మరిదిగా (లక్ష్మీ ప్రణతి సోదరుడు) నితిన్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2023లో విడుదలైన 'మ్యాడ్'తో ఆయన ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఇటీవల ఆయన నటించిన 'ఆయ్' విడుదలైంది. మంచి విజయాన్ని అందుకుంది.

# బోర్డర్-గావస్కర్ ట్రోఫీ.. ముందుగానే ఆస్ట్రేలియాకు కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్



బోర్డర్–గావస్కర్ ట్రోఫీ నవంబర్ 22 నుంచి ప్రారంభంకానుంది. ఈ ఐదు టెస్టుల సిరీస్ కోసం సీనియర్ జట్టు మరికొద్ది రోజుల్లో అక్కడికి వెళ్లనుంది. ఈలోగా భారత్ ఏ అక్కడికి వెళ్లింది. ఆస్ట్రేలియా ఏతో రెండు అనధికారిక టెస్టుల సిరీస్ బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. నవంబర్ 7 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. అయితే, న్యూజిలాండ్‌తో సిరీస్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్లు రాణించలేదు. దీంతో ఈ సిరీస్‌కు ఎంపికైన కేఎల్ రాహుల్ , బ్యాకప్ వికెట్‌కీపర్ ధ్రువ్ జురెల్‌ను మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ముందుగానే ఆస్ట్రేలియాకు పంపించాలని టీమ్‌ఇండియా నిర్ణయించింది. వీరిద్దరూ మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లి ఇండియా ఎ జట్టుతో కలవనున్నారు.మరోవైపు, ఇండియా ఎ, టీమ్‌ఇండియా మధ్య జరగాల్సిన మూడు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ రద్దయినట్లు కెప్టెన్ రోహిత్ శర్మ ధ్రువీకరించాడు. కివీస్‌తో టెస్టు సిరీస్‌లో పేలవమైన ప్రదర్శన దృష్టిలో ఉంచుకుని ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. బోర్డర్–గావస్కర్ ట్రోఫీ కోసం భారత జట్టు బృందాలుగా ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత కారణాలతో దూరమయ్యే అవకాశాలున్నాయి. రోహిత్ ఆడకపోతే జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

# టీమ్ఇండియా.. ఆ సిరీస్ తర్వాత నలుగురు సీనియర్లను పక్కనపెడతారా?



న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో టీమ్‌ఇండియా ఘోర పరాజయం చవిచూసింది. స్వదేశంలో తొలిసారి 0–3తో సిరీస్‌ను కోల్పోయింది.ఈ సిరీస్‌లో సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రాణించలేదు. దీంతో రాబోయే డబ్ల్యూటీసీని దృష్టిలో ఉంచుకుని జట్టులోని సీనియర్ ఆటగాళ్లయిన రోహిత్ శర్మ, కోహ్లి, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను పక్కనపెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. బోర్డర్–గావస్కర్ ట్రోఫీ తర్వాత దీనిపై ఓ నిర్ణయం తీసుకునే ఛాన్స్ వున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్‌పై బీసీసీఐ పెద్దలు, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ అనధికార చర్చలు జరపనున్నారని సమాచారం."న్యూజిలాండ్ చేతిలో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. అయితే, ఆస్ట్రేలియాతో సిరీస్ ఎంతో దూరంలో లేదు. నవంబర్ 10నే భారత జట్టు ఆస్ట్రేలియాకు బయలుదేరనుంది. ఇప్పటికే జట్టును ప్రకటించినందున మార్పులు చేర్పులు ఉండే అవకాశం లేదు. కానీ, ఇంగ్లాండ్‌లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు టీమ్‌ఇండియా అర్హత సాధించకపోతే.. ఆ నలుగురు సూపర్ సీనియర్లు యూకేలో జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం విమానంలో ఉండరని నిశ్చయించుకోవచ్చు. నాకు తెలిసి స్వదేశంలో ఈ నలుగురు కలిసి స్వదేశంలో తమ ఫైనల్ టెస్టు ఆడినట్లే" అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.నవంబర్ 22 నుంచి బోర్డర్–గావస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఈ ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 4–0తో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుంది. ఇక, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను లండన్‌లోని ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో జూన్ 11–15 మధ్య నిర్వహించనున్నారు. 2025–2027 డబ్ల్యూటీసీలో భాగంగా జూన్‌లో టీమ్‌ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి ఆతిథ్య జట్టుతో ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది.

# WTC ఫైనల్.. బరిలో ఐదు జట్లు.. ఏ జట్టుకెన్ని అవకాశాలు?



న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో టీమ్‌ఇండియాకు వైట్‌వాష్ తప్పలేదు. ముంబయిలో జరిగిన మూడో టెస్టులో విజయానికి చేరువైన భారత్.. చివరకు 25 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ లో టీమ్‌ఇండియా అగ్రస్థానాన్ని కోల్పోయింది. అంతేకాకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా (62.50 శాతం) టాప్‌లో ఉంది. భారత్ (58.33 శాతం), శ్రీలంక (55.56 శాతం), న్యూజిలాండ్ (54.55 శాతం), దక్షిణాఫ్రికా (54.17 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఐదు జట్లు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి అవకాశాలున్నాయి. ఏ జట్టుకు ఎన్ని మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి, ఎన్ని విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా ఫైనల్ చేరతాయో ఓ లుక్కేద్దాం.ఆస్ట్రేలియా ప్రస్తుతం డబ్ల్యూటీసీ టేబుల్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా.. ఇంకా ఏడు టెస్టులు ఆడాల్సి ఉంది. స్వదేశంలో భారత్ ఐదు టెస్టులు (బోర్డర్–గావస్కర్ ట్రోఫీ) ఆడనుంది. తర్వాత రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆసీస్ ఈ ఏడు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్‌కు చేరుతుంది. భారత్ ప్రస్తుత టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఐదు మ్యాచ్‌లే ఆడాల్సి ఉంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో బోర్డర్–గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఆసీస్ వేదికగా జరిగే ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ భారత్‌కు సవాలుగా మారింది. టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్‌ను 4–0తో కైవసం చేసుకోవాలి. అంటే నాలుగు మ్యాచ్‌ల్లో తప్పక విజయం సాధించడంతోపాటు మరో మ్యాచ్‌లో విజయం సాధించకపోయినా కనీసం డ్రా చేసుకోవాలి. ఆసీస్‌ను సొంత గడ్డపై 4–0తో ఓడించడం అంత తేలికైన విషయం కాదు. శ్రీలంక శ్రీలంక ఇటీవల న్యూజిలాండ్‌పై రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులోకి వచ్చింది. లంక ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో రెండు మ్యాచ్‌లు సౌతాఫ్రికాలో, రెండు మ్యాచ్‌లు స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఆడనుంది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తేనే శ్రీలంక ఫైనల్ చేరుతుంది. న్యూజిలాండ్ శ్రీలంక చేతిలో ఘోర ఓటమి చవిచూసిన కివీస్.. భారత్‌తో టెస్టు సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులోకి దూసుకొచ్చింది. న్యూజిలాండ్ ఈ డబ్ల్యూటీసీలో ఇంకా మూడు మ్యాచ్‌లే ఆడాల్సి ఉంది. నవంబర్‌లో ఇంగ్లాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో కివీస్ తలపడనుంది. ఈ మూడింట కచ్చితంగా గెలవడంతో ఇతర జట్ల ఫలితాలూ అనుకూలిస్తే న్యూజిలాండ్ ఫైనల్ చేరడానికి అవకాశాలున్నాయి.

# దిల్‌రాజు సినిమా.. ఆ కారణంతోనే చేయలేకపోయా: దుల్కర్ సల్మాన్



'లక్కీ భాస్కర్'తో తెలుగులో హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు మలయాళీ నటుడు దుల్కర్ సల్మాన్ ఈ సినిమా సక్సెస్ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఆయన సినిమా విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. 'మహానటి' కంటే ముందే తనకు తెలుగు నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు."మంచి మనసున్న మనుషులంతా కలిస్తే గొప్ప సినిమా తెరకెక్కించవచ్చని నేను నమ్ముతా. అందుకు ఉదాహరణ ఈ సినిమా. ఇందులో వర్క్ చేసిన వారందరూ గొప్ప వ్యక్తులు. ఆయా పాత్రలకు సరైన న్యాయం చేశారు. 'లక్కీ భాస్కర్' చూసి సుమతి లాంటి సతీమణి తమకు కావాలని చాలామంది కోరుకుంటున్నారు. ఒక నటికి అంతేకంటే ప్రశంస ఏముంటుంది. జీవీ ప్రకాశ్ మ్యూజిక్ అదరగొట్టేశారు. ఎప్పటినుంచో ఆయనతో వర్క్ చేయాలనుకుంటున్నా. ఈ సినిమాతో మా కాంబో సెట్ అయింది. తెలుగు ప్రేక్షకులతో నాకు ఏదో తెలియని అనుబంధం ఏర్పడింది. 'ఓకే బంగారం' విడుదలయ్యాక దిల్‌రాజు నాకొక అవకాశం ఇచ్చారు. తెలుగు సరిగ్గా రాకపోవడంతో ఆ సినిమా అంగీకరించలేకపోయా. 'మహానటి'తో నాగ్ అశ్విన్ నా వద్దకు వచ్చినప్పుడు.. అదే విషయాన్ని చెప్పా. 'భాష సరిగ్గా రాదు ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారా' అని ఎంతో సందేహం వ్యక్తం చేశా. నాగి, స్వప్న నన్నెంతో నమ్మారు. వారి వల్లే ఆ సినిమాలో భాగం కాగలిగాను. హను రాఘవపూడి 'సీతారామం' కథ చెప్పిన రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. నా కెరీర్, జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా ఇచ్చారు. వెంకీ అట్లూరిని చూసి మా నాన్న ఒకటే మాట చెప్పారు. ఈ చిత్రాన్ని అతడు దర్శకత్వం వహించాడంటే ఎవరూ నమ్మరు అన్నారు (నవ్వులు). ఇందులో భాగమైనందుకు, ఇలాంటి టీమ్‌తో వర్క్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది" అని దుల్కర్ చెప్పారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మీనాక్షి సినీ ప్రియులకు ధన్యవాదాలు చెప్పారు. సుమతిని ఆదరిస్తున్నారంటే పూర్తి క్రెడిట్ దర్శకుడికే ఇస్తానని అన్నారు.దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ..

"దాదాపు 15 ఏళ్ల క్రితం నటుడిగా నా కెరీర్ మొదలుపెట్టా. ఆ సమయంలో చంద్రశేఖర్ యేలేటి సినిమా కోసం హను రాఘవపూడి, 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' కోసం నాగ్ అశ్విన్ నన్ను ఆడిషన్ చేశారు. ఈరోజు మేము ముగ్గురం ఒకే స్టేజ్‌పై నిల్చున్నాం. దుల్కర్‌తో సినిమా చేశాం. హిట్టులు కొట్టాం. ఇలాంటి రోజును ఏమాత్రం ఊహించలేదు. దీపావళికి విడుదలైన మూడు చిత్రాలు బ్లాక్ బస్టర్ అయ్యాయి. మంచి సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. ఇదే ఉదాహరణ. 'ఏబీసీడీ' చూసిన తర్వాత నుంచి దుల్కర్‌తో సినిమా చేయాలనుకున్నా. ఫైనల్‌గా ఇలా నా కల నెరవేరింది. కథ విన్న వెంటనే ఆయన ఓకే చెప్పారు. సుమతి పాత్రకు ప్రాణం పోసింది మీనాక్షి. అందరూ చక్కగా నటించారు" అని వెంకీ అట్లూరి తెలిపారు."సార్' నుంచి వెంకీ నాకు నచ్చుతున్నాడు. సామాజిక అంశాన్ని చాలా హృద్యంగా చెప్పారు. ఆ సినిమా చూసి కన్నీళ్లు పెట్టుకున్నా. అప్పటి నుంచి ఆయనకు అభిమానిని అయ్యా. మా అమ్మ, అమ్మమ్మ ఇటీవల 'లక్కీ భాస్కర్' చూశారు. "నువ్వెప్పుడు ఇలాంటి సినిమా చేస్తావు. ప్రేమకథలు ఇక చాలు. ఇలాంటి పనికొచ్చే సినిమా చేయ్" అని చెప్పారు. అలాంటి ప్రశంసలు దక్కడం సాధారణం కాదు" అని దర్శకుడు హను రాఘవపూడి పేర్కొన్నారు.




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| సోమవారం 04 నవంబర్ - 2024 || పేజీలు : 4

# కె.బీఆర్.ఆర్ గార్డెన్స్ లో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం

- ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్
- ధర్మ సమాజ్ పార్టీ ప్లీనరీ విద్యా వైజ్ఞానిక సదస్సులో ప్రసంగిస్తున్న హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య
- హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య ను విద్యావేత్త వెంకట్ రెడ్డి నీ సన్మానిస్తున్న డాక్టర్ విశారదన్ మహరాజ్










**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం అరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలని రేవంత్ రెడ్డిప్రభుత్వంపై ప్రజాయుద్ధం చేయడానికి ధర్మసమాజ్ పార్టీ తెలంగాణ వ్యాప్తంగా 15,000 కిలోమీటర్ల పాదయాత్రను చేపడుతున్నట్లుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రకటించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో కేబి అర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యం రావాలని రాష్ట్ర వ్యాప్తంగా 2025జనవరి 5న ఆదిలాబాద్ నుంచి తాను మహా పాదయాత్ర ను ప్రారంభించి మూడున్నర సంవత్సరాలు 2028 వరకు కొనసాగిస్తామన్నారు. గతంలో పదివేల కిలోమీటర్ల స్వరాజ పాదయాత్రగా చేపట్టి ధర్మసమాజ్ పార్టీని ప్రకటించుకున్నట్లుగా తెలిపారు. బీసీ ఎస్సీ ఎస్టీ అనగారిన ప్రజలకు ఉచితంగా విద్యా వైద్యం ఉపాధి భూమి ఇల్లును సాధించేవరకు పోరాడుతామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారంటీలు ప్రకటించి 420 హామీలిచ్చి అడ్డదారిన అధికారంలోకి వచ్చి నియంత పాలన కొనసాగిస్తుందన్నారు. నాడు బిఆర్ఎస్ నేడు బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని రాజ్యాంగ వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. అందుకే ధర్మ సమాజ్ పార్టీ ఈ తెలంగాణలోని అగ్రకుల పార్టీలపై రాజకీయ యుద్ధం చేసి అణగారిన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దుర్గా ప్రసాద్, అన్నెల లక్ష్మణ్, హరీష్ గౌడు, వినోద్ యాదవ్ , రాఘవేంద్ర ముదిరాజ్, రెహమాన్, సుమన్, శ్రీకాంత్, హరప్ప శివన్ , కార్తీక్ ఆయా జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ధర్మ సమాజ్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ధర్మ పోరాటం చేయాల్సిందే

### - హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య

అణగారిన వర్గాలకు అన్యాయం చేస్తున్న ఈ రాజకీయ పార్టీలు పాలకులపై న్యాయపోరాటమే కాదు ధర్మపోరాటం చేయాల్సిందేనని హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీ సందర్భంగా ఏర్పాటు చేసిన బీసీ ఉద్యమం విద్యా వైజ్ఞానిక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామాల్లో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు రక్షణగా ధర్మ సమాజ్ పార్టీ ఉండాలని ఆయన కోరారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు వర్గీకరణ అవసరమని అవీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కేవలం రాష్ట్రాలు మాత్రమే చేయాలనడం సరికాదని కేంద్రం రాష్ట్రం రెండింటికి వర్గీకరణ విషయంలో పూర్తి బాధ్యత ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ఒక పద్ధతి ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లకు మరో పద్ధతి అనుసరించడం బాధాకరమన్నారు. ప్రముఖ విద్యావేత్త వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పేదలను విద్యకు దూరం చేసిన పాలకులు మనకు అవసరమా అని ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు లేకపోవడం వసతులు లేకపోవడం భవనాలు లేకపోవడం ఆ పిల్లలను వెలివేయడమేనని అగౌరవపరచడమే అన్నారు. విద్యతోనే విముక్తిని అన్నారు. విద్యా వైద్యంపై పలు అంశాలను క్లుప్తంగా అయన వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశారదన్ మహారాజ్ మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య , వెంకటరెడ్డి లను భారత రాజ్యాంగ పుస్తకాలను బహుకరించి సత్కరించారు.

# తేమ పేరుతో కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలి : కాసాల





**చండూర్ నవంబర్ 3 (శాసనసభ న్యూస్):** ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి నల్లగొండ జిల్లాలో ఇటు వరి ధాన్యం, అటు పత్తి పంట పూర్తిగా తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తేమ పేరుతో కాలయాపన చేయకుండా రైతులు పండించిన పంటలను వేగవంతంగా కొనుగోలు చేయాలని బిజెపి కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం చండూరు, నాంపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను, అదేవిధంగా పత్తి పంటలను కాసాల సందర్శించి పరిశీలించారు. అనంతరం గుండ్రపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు సెంటర్లో ఇక్కడి రైతులతో కలిసి శాసనసభ ప్రతినిధితో మాట్లాడారు. జిల్లాలో వరి, పత్తి కొనుగోలు కేంద్రాలను అధికారులు అట్టహాసంగా ప్రారంభించారే కానీ కొనుగోలు మరిచారన్నారు.

# పూర్తిస్థాయి విద్యుత్ అధికారిని నియమించాలి : కాసాల

**చండూర్ నవంబర్ 3 (శాసనసభ న్యూస్):** చండూరు మండలానికి పూర్తిస్థాయి మండల విద్యుత్ అధికారి లేకపోవడం మూలంగా గట్టుప్పల మండల ఏఈని చండూరు మండలానికి ఇన్చార్జి ఏఈగా నియమించారని దీంతో రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చండూరు మండలానికి పూర్తిస్థాయి నూతన విద్యుత్ అధికారిని నియమించాలని బిజెపి కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి కోరారు. ఆదివారం శాసనసభ ప్రతినిధితో మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని ఇటువంటి కీలక సమయంలో ప్రజల సౌకర్యార్థం మండల విద్యుత్ ఏఈ లేకపోవడం సరికాదన్నారు.



# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



**చండూర్ నవంబర్ 3 శాసనసభ న్యూస్) :** పుల్లెంల గ్రామంలో ఇటీవలే అనారోగ్య సమస్యతో అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుడు వట్టికోటి సైదులు కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి స్నేహం అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు సాటి మిత్రులు. పుల్లెంల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998 – 99, పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించి రూపాయలు 60,000/- నగదును సేకరించి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మరొకటిలేదని అందరితో మమేకమై కలివిడిగా కష్టసుఖాలను పాలుపంచుకునే ఆప్త మిత్రుడు దూరమవ్వడం చాలా బాధాకరమని భౌతికంగా మా మధ్య లేకపోయినా అతని భావాలు మాపై చూపించిన ఆధారాభిమానాలు ఏనాటికి చెరగని స్మృతులుగా మా మధ్య మెదలాడుతూనే ఉంటాయని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మిత్రుడు వట్టికోటి సైదులు కుటుంబానికి ఎల్లవేళలా తమవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకూరి రమేష్, పాలకూరి శ్రీనివాస్ ,బొబ్బల శేఖర్ రెడ్డి,బొడ్డు సైదులు,భూతరాజు చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరగా బీటీ రోడ్డు నిర్మించాలి: కొమ్ము గణేష్



**చండూర్ నవంబర్ 3 (శాసనసభ న్యూస్) :** కొండాపురం నుండి వయా గొడ్డటిగూడెం మీదగా శెరిగూడెం రోడ్డు నిర్మాణంను త్వరగా చేపట్టాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించినా గత ఐదు సంవత్సరాలుగా నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఆదివారం సంబంధిత రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు అనంతరం మరిచిపోతున్నారని, రోడ్డు సౌకర్యం లేక రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొడ్డటిగూడెం గ్రామస్తులు గొడ్డటి పెంటయ్య, పరమేష్ , గొడ్డటి చిన్న రాములు, అనసుయ,అలివేలు, అంజమ్మ , నవీన్, శివ,తదితరులు పాల్గొన్నారు.

# 3 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మంచాల పృథ్వీరాజ్

**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** మంచాల మండలం బండలేమూరు గ్రామానికి చెందిన జోగు పృథ్వీరాజ్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఇటీవల విడుదలైన పలు పరీక్షల ఫలితాల్లో తెలుగు పండిట్, ఎస్జీటీ టీచర్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు పృథ్వీరాజ్ ఎన్నికయ్యాడు. తల్లి తండ్రి లేనప్పటికీ కష్టపడి చదివి లక్ష్యాన్ని చేదించాడు. దీంతో పృథ్వీరాజ్ ప్రతిభను ప్రతి ఒక్కరు కొనియాడుతున్నారు.



# మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం

## - టీడీపీ తెలుగు యువత మండలాధ్యక్షుడు మెట్టు దామోదర్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ దిగ్విజయంగా అమెరికా పర్యటన ముగించుకొని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న తరుణంలో ఇబ్రహీంపట్నం మండల తెలుగు యువత అధ్యక్షులు మెట్టు దామోదర్ రెడ్డి , పలువురు టిడిపి సీనియర్ తో కలిసి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకోవడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి, ముగియగానే మండల, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటుచేసి తెలంగాణలో పార్టీని పటిష్టం చేసేదిశగా అడుగులు ముందు కలుపుతున్నారని ఆయన అన్నారు. తెదేపా యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ సైతం తెలంగాణలో పార్టీ అధిష్టానం చేయడానికి తాముందు సహకారం అందించనునట్లు తెలిపారు.ఇబ్రహీంపట్న ం నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని, నియోజకవర్గం లో టిడిపి క్యాడర్ అదేవిధంగా ఇప్పటికీ ఉందని ఆయన అన్నారు. రానున్న కాలంలో తెలంగాణ గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరడం ఖాయమన్నారు.



## రైతన్నల ఉసురు పోసుకోవద్దు
## బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కస్తాల వెంకన్న



**చండూర్ నవంబర్ 3 శాసనసభ న్యూస్) :** ఎద్దేడ్చిన యవసం.. రైతు ఏడ్చిన రాజ్యం ముందల బడదు అన్న సత్యాన్ని విస్మరించి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల ఉసురు పోసుకోవద్దని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కస్తాల వెంకన్న, బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్ లు ఓ సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే తమ అసమర్థ పరిపాలన వల్ల పండగ లాంటి వ్యవసాయం దండగ మారి రైతన్నలు విలవిలలాడుతున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేస్తామని అబద్ధపు మాటలు చెప్పి నేటికీ 300 రోజులు గడిచిన ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ రైతులను నిట్ట నిలువునా ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రోజుకో మోసపూరిత ప్రకటన చేస్తూ రైతు రుణమాఫీలో మోసం, రైతుబంధు ఇవ్వకపోవడం, తుదకు పండించిన పంటను కూడా కొనుగోలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అబద్ధపు మాటలతో పరిపాలన చేస్తున్న ఈ ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తన వట్టి మాటలు కట్టిపెట్టి ప్రజల కోసం ప్రజల అవసరాలు తీర్చే విధంగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని వారు హితవు పలికారు. ఇప్పటికే కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు పూర్తిగా నష్టపోయి అన్నదాతలు అతలాకుతలు అవుతుంటే వచ్చిన కొద్దిపాటి పంటను కూడా కొనుగోలు చేయకుండా ఈ ప్రభుత్వం సి.సి.ఐ.,ఐ.కె.పి. కేంద్రాలను 20 రోజుల క్రితమే ప్రారంభించి కొనకుండా కాలయాపన చేస్తుందని , పేరుకే కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభం చేసి ఇప్పటివరకు కొనుగోలు చేపట్టకపోవడం మూలంగా రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తు అవస్థలు పడుతున్నారని ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తడిసిన ధాన్యంతో సహా పూర్తిగా కొనుగోలు చేసే అన్నదాతలను ఆదుకోవాలని వారు కోరారు.

## మాల ఉద్యోగుల స్వాభిమాన సభకు తరలిన చింతపల్లి నాయకులు

**- ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి మండలాధ్యక్షుడు గాదరి జంగయ్య.**





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** దళితులకు రాజ్యాధి కారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చింతపల్లి మండల అధ్యక్షుడు గాదరి జంగయ్య విమర్శించారు. “హలో మాల చలో నల్గొండ” అనే నినాదంతో చింతపల్లి మండలంలోని వివిధ గ్రామాల మాల సోదరులను సమూహపరచి ఆదివారం నాడు చింతపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం నల్లగొండ మాల ఉద్యోగుల స్వాభిమాన సభకు బయలుదేరడం జరిగిందని, గాదరి జంగయ్య అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిగంబరం కాంబ్లే, రేంజర్ రాజేష్, కోర సాయిరాం పాల్గొనగా వారిని శాల వాళ్ళతో సన్మానించడం జరిగింది. అనంతరం వర్గీకరణపై వచ్చిన తీర్పును ఆయా రాష్ట్రాలు అమలు చేయకుండా నిలువరించే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ కుట్రలో మంద కృష్ణను పావుగా వాడుకుంటున్నార న్నారు. ఈతీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదని, వర్గీకరణ మాటున క్రిమీలేయర్ కుట్ర జరుగు తున్నదన్నారు. దీని వలన ఎస్సీ, ఎస్టీలలోని అన్ని కులాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మనువాదుల కుట్రను ఎదుర్కొనేం దుకు మాలలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ నల్లవెల్లి సంజీవ,గోరేటి సాలయ్య,నిమ్మ వీరయ్య,నిమ్మ వెంకట్ రాములు,నిమ్మ చంద్రయ్య,నల్లవెల్లి సైదులు, నాగటి వెంకటేష్, నల్లవెల్లి ప్రభాకర్, నల్లవేల్లి రామకృష్ణ, కూన పరమేష్,గంటల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బిజెపి బలోపేతం కోసమే సభ్యత్వ నమోదు కార్యక్రమం

**- దేశం కోసం మోడీ- మోడీ కోసం మనం అనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న ప్రజలు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్**



**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** ప్రభాస్ యోజనలో భాగంగా చింతపల్లి మండలం మల్(గొడుకోండ్ల) లో మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ ఆధ్వర్యం లో ఆదివారం నాడు బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ వర్షిత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో అనూహ్య స్పందన చూసి చాలా ఆనందంగా వుందని, మోది ఉంటేనే దేశంసుభిక్షంగా ఉంటుంది మన శత్రుదేశాలు మన దేశం వైపు చూడాలంటే వణుకు పుడుతుందన్నారు. ఈలాంటి దేశభక్తుడి నాయకత్వంలో మన దేశం నడు-స్తుండడం గర్వకారాణమని అన్నారు. “దేశం కోసం మోడీ- మోడీ కోసం మనం” అని ప్రజలు బిజెపి సభ్యత్వం తీసుకోవడం కోసం ముందుకు రావడం చాలా ఆనందంగా వుంది అనిఅన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్, మండల ఉపాధ్యక్షులు గొట్టే పర్వతాలు, కనిగిరి గోవర్ధన్, సందుపట్ల రాజేష్, గుర్రం వెంకటరమణ, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్ గౌడ్, పొలగొని బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సదర్ సమ్మేళన కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 3 :** ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు గ్రామ యాదవులు నిర్వహించిన సదర్ సమ్మేళన నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి క్యామ మల్లేష్, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యాదవ సోదరులు,గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది అనంతరం విచ్చేసిన నాయకులకు శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది.

# ఘనంగా 'జంగా' కుమార్తె వివాహం



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి కుమార్తె డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్రెడ్డిల వివాహం హనుమకొండ జిల్లా కాజీపేట పరిధి మడికొండలోని సత్యసాయి గార్డెన్లో ఆదివారం ఘనంగా జరిగింది.సీఎం రేవంత్రెడ్డి హాజరై దంపతులను ఆశీర్వదించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో బయలుదేరిన సీఎం.. మడికొండలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్కు ఉదయం చేరుకున్నారు. అక్కడ వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, పోలీసు కమిషనర్ అంబర్ కిషోరా..సీఎంకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సత్యసాయి గార్డెన్కు చేరుకొని నూతన దంపతులు డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం సీఎం రేవంత్రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హెలిక్యాప్టర్లో హైదరాబాద్కు తిరిగి బయలుదేరి వెళ్లారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్బాబు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీబీ చైర్మెన్ మార్నేని రవీందర్రావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్రెడ్డి, పాడి కౌశిక్రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడాలి

- అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లో వసతులు కల్పిస్తాం
- బడుగు, బలహీన వర్గాల కోసమే.. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం
- 20 నెలల్లో ఎస్ఎల్బీసీ సొరంగం ప్రాజెక్టు పూర్తి చేస్తాం :ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కోరి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. 7.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెస్, కాస్మోటిక్స్ చార్జీలు ఒక్కసారిగా 40 శాతం పెంచుతూ దీపావళి పండుగ రోజు ఆదేశాలు విడుదల చేశామని తెలిపారు. పేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్.. అన్ని వర్గాల విద్యార్థులందరూ ఒకే చోట చదువుకునేలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఒకే ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.5 వేల కోట్లు కేటాయించామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పనులు.. ఎక్కడివక్కడే నిలిచి పోయాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతులు సాధించామని తెలిపారు. ఏడాదిలో మూడు సార్లు పర్యటించి రెండు యూనిట్లు సింక్రనైజ్ చేసినట్టు చెప్పారు. 20 నెలల్లో ఎస్ఎల్బీసీ సొరంగం ప్రాజెక్టు పనులను పూర్తి చేయిస్తామని, నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. మంత్రులు ఉత్తమ్కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి తాను ఎస్ఎల్బీసీ దగ్గర సమీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు.మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని, రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చెరువులు, చెట్లు, గుట్టల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో మంచి నాణ్యమైన విద్యను బోధించేందుకు గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలకు డబుల్ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి రాంబాబు, డీఆర్డీఏ పీడీ అప్పారావు, మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, తహసీల్దార్ బండ కవిత, ఎంపీ డీవో సరోజ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు త్రిపుర అంజన్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్గౌడ్, ఎల్-27 లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మెన్ సుందరి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జనవరిలో పంచాయతీ ఎన్నికలు?

- ఎలక్షన్లు నిర్వహించకపోవటం వల్ల కేంద్రం వద్ద రూ.1,800 కోట్లు పెండింగ్

**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** రాబోయే కొత్త సంవత్సరం (2025)లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నారా? అందుకు సంబంధించి కసరత్తులు షురూ అయ్యాయా? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. 2025లో నిర్వహించ బోయే అన్ని ఎన్నికలకు ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించటం, ఈనెల ఆరు నుంచి కుల గణన ప్రారంభం కానుండటం, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను త్వరలోనే ఎంపిక చేస్తామంటూ మంత్రి పొంగులేటి ప్రకటించటం తదితర పరిణామాలన్నీ 'పంచాయతీ' నగరాకు సన్నాహాలుగా కనబడుతున్నాయి. ఈ యేడాది జనవరితో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం పూర్తయిన సంగతి విదితమే. అప్పటి నుంచి.. అంటే దాదాపు పది నెలల నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. ఈ క్రమంలో కుల గణన చేపట్టిన వెంటనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్, ఆయన మంత్రివర్గ సహచరులు చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఆ ప్రక్రియ ప్రారంభం కాబోతోంది. మరోవైపు పంచాయతీ ఎలక్షన్లు నిర్వహించకపోవటం వల్ల నిబంధనల ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన రూ.1,800 కోట్లను విడుదల చేయకుండా కేంద్రం నిలిపేసింది. సత్వరమే ఎన్నికలను నిర్వహించటం ద్వారా ఆ నిధులను రాబట్టుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశముందని ఉన్నతాధికారులు తెలిపారు.మరోవైపు రాష్ట్రంలో కుల గణన పూర్తయితే..ఆ




లెక్కల ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తారా? లేదా? అన్నది వేచి చూడాలి. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కలిపి సుమారుగా 80 శాతానికి పైగా ఉన్నారు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ కుల గణనను చేపట్టి, ఆ ప్రకారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేస్తుందా? లేదా? అన్నది కూడా పెద్ద ప్రశ్నే. ఒకవేళ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వాటిని అమలు చేయాల్సి వస్తే, 80 శాతం మేర అమలు చేయాలి. కానీ ఏ అంశంలోనైనా 50 శాతానికి మించి రిజర్వేషన్లను అమలు చేయకూడదంటూ కోర్టులు తీర్పులిచ్చాయి. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలా ముందుకెళుతుందనేది వేచి చూడాలి. ఇందుకు సంబంధించి ఎవరైనా న్యాయస్థానం మెట్లెక్కితే అప్పుడు రేవంత్ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది కూడా ఆసక్తికరమే. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కొత్తేడాదిలో నిర్వహించబోయే పంచాయతీ ఎన్నికలు సర్వత్రా చర్చనీయాంశం కాబోతున్నాయి.

# వడ్లు కొనడం లేదని అన్నదాతల ఆగ్రహం

**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అయినా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వక్తం చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధాన రహదారిపై ఆదివారం ధర్నా చేశారు. స్పందించిన కలెక్టర్ కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామంలోని ఐకేపీ సెంటర్లలో ధాన్యం పోసి నెల రోజులైనా కొనుగోలు చేయడం లేదని గ్రామ రైతులు కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై వడ్లు పోసి బైటాయించారు. వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ధర్నాలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్రావుతో అధికారులు ఫోన్లో మాట్లాడి ధర్నా విరమింప చేయాలని కోరారు. అయినా రైతులు



ఆందోళన కొనసాగింది. సమచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి విరమింపచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి పదిర ఐకేపీ సెంటర్ను సందర్శించి వెంటనే వడ్లను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కేంద్రాన్ని ప్రారంభించారు. ధర్నాలో సుమారు 100 మంది పైగా రైతులు పాల్గొన్నారు.